# నాయనమ్మ

అడ్డొస్తున్న మబ్బుల్ని తప్పించుకుంటూ ఆదరాబాదరాగా పడమటి కొండలవైపు పరుగుపెడ్తున్నాడు సూరీడు. ఆధునికతకు, సంప్రదాయానికి మధ్య నలుగుతున్న రామాపురంలో జీవన సమరంలోని మరో సాయంత్రం రాత్రిగా మారే పోరాటం మొదలైంది.

జీరోబల్బు వెలుగులో గోడ నానుకొని ఏవో ఆలోచనల్లో పడి కొట్టుకుపోతున్నది శాంతమ్మ- 'ఆడదానికి మొగనితోనే బతుకు ఆ పసుపు-కుంకుమ పోయినంక ఎన్నున్నా కాలుతున్నకట్టె తీరే గద'... అనుకునే సరికి ఇంకిపోయిన కళ్ళలోతుల్లో ఎక్కడో కదిలాయి కన్నీళ్ళు.

పేరుకే యిద్దరు కొడుకులు. అడ్డాలనాటి మురిపెం మాత్రమే మిగిలిందామెకు. పెళ్ళయ్యి యేడాది తిరగకుండనే పెద్దకొడుకు సాయన్న ఉన్న ఊళ్ళోనే వేరే కాపురం పెట్టాడు. చిన్నోడు శివయ్య డ్రైవరు పని (డ్రైవింగ్) నేర్చుకొని పట్నంలో మకాం పెట్టాడు. ఎప్పుడో యాడాదికొకసారి చుక్క తెగిపడ్డట్టు కనబడి పోతుంటాడు.

శాంతమ్మ మొగుడు బతికున్న రోజుల్లో ఆమెకు చేసిందేమీ లేదు. కాకపోతే పిల్లల దూరమైనా ఒంటరితనం మాత్రం కనబడనీయలేదు.

కళ్ళముందున్న ప్రపంచమంతా మసకబారినట్టు అనిపిస్తుండగా - వాకిట్లో ఏదో అలికిడి. అలికేసినట్లు ఓ ఆకారం .... శాంతమ్మ కళ్ళు నులుముకొని చూసింది. రక్తసంబంధాన్ని వెంటనే పోల్చుకున్నది.

"రాజన్నా ! గుండె గొంతుకలోకొచ్చింది శాంతమ్మకు.

"ఊఁ ! 'ఔ'నన్నట్టు మూలిగాడు. వాని పేరు రాజశేఖర్. పెద్దోడి పెద్దకొడుకు. ఈ ఏరోకకు ఎనిమిదేండ్లు నిండినయ్

మామూలుగా అయితే " నాయనమ్మా ! నాయనమ్మా !" అంటూ పరుగెత్తుకొస్తాడు వాడు. అట్లా రాలేదంటే ఏదో జరిగిందన్నమాటే. ఆ నాయనమ్మలోని అమ్మ మనసు అది గ్రహించింది. కన్నీళ్ళతో పాటే తన మానసిక వ్యధను తుడిచేసుకుంది.,



" ఏమైంది రాజన్న దొరా .. ! అడ్నే ఆగిపోయివ్ ? దా ...! దా ...! " అంటూ ముద్దుగా పిలిచింది. వాడ్ని చూసినప్పుడల్లా భర్త గుర్తుకొస్తాడామెకు.

నాయనమ్మ పిలుపు వాని బాధకు మందులా పనిచేసింది. మెల్ల మెల్లగా వచ్చి ఆమె ఒడిలో వాలిపోయాడు.

గుండెకు హత్తుకొని, నుదుట ముద్దుపెట్టుకుందా తల్లి.

మబ్బు తొలగిన చందమామలా వెలిగిపోయింది రాజు మొహం... "నేనింటికి వోను నాయనమ్మా ! ఈడ్నే ఉంట " అన్నాడు ప్రతిజ్ఞ చేస్తున్నట్టు, అట్లా అంటూనే నాయనమ్మ ఒడిలో ఒదిగిపోయాడు.

"మా రాజే ! మా రాజే ! " మరోసారి ముద్ద పెట్టుకుందామె.

" పెద్దలైటేస్త నాయనమ్మా !" అంటూనే నాయనమ్మ సమాధానం కోసం చూడకుండా అరవై వోల్టుల బల్బువేసి, జీరోబల్బుని ఆర్పేశాడు రాజు.

ఒకే ఒక్క గదిలా వున్న ఆ పెంకుటింటిలో రెండు బల్బులు, చీకటికి అలవాటుపడ్డ శాంతమ్మ వంట చేసుకునేటప్పుడో, వచ్చినవాళ్ళకెవరికైనా అవసరమున్నప్పుడో తప్ప పెద్దలైటు వెయ్యదు. తనలాగే చీకటితో పోరాడే జీరోబల్బు అంటేనే ఆమెకిష్టం. ఆ ఇంటి కరెంటు బిల్లు ఎప్పుడూ మినిమమ్ దాటదు.

"అబ్బో యీయాల్ల రాజయ్య నాయనమ్మ పంచన జేరిందూ...." ఇంట్లోకి వస్తూనే ఆశ్చర్యం వెలిబుచ్చింది సావిత్రి.

"ఏమోనమ్మా ..! మళ్ళ ఆలు-మగలు కస్సుపిస్సనుకున్నట్లున్నరు. ఊకుండజాలక వీడు మర్దినవోయ్యిండో, యేమో...."

"కాదు నాయనమ్మా...! " నాయనమ్మ నడ్డుకుఉంటూ చెప్పాడు రాజు. "మా సారు డిరస్ (యూనిఫాం) లేకుంటే ఇస్కోల్లకు రావద్దన్నాడు. సాయిననమో అన్నందినే యాల్లకు వొయ్యి తిని రమ్మంటడు. ఆజిరి (హాజరు) లేకుంటె అనన్నం బెడుతారు ? ఇస్కోల్ల అన్నం బెట్టలేదు. ఆకలయ్యి పొద్దుమూకినంక ఇంట్ల అన్నం దింటుంటె....కొట్టిండు...." తలచుకోగానే గంగ పొంగింది కంట్లో.

అయ్యో ...! అన్నం దినేటప్పుడు గొడుతారు ? పసిపిల్లగాడు, అక్కడవోతే సారు గొట్టే, ఇక్కడొస్తే అయ్యగొట్టే..." సానుభూతి వర్షించింది సావిత్రి గొంతులో.

"అయ్యో బిడ్డా...! " నిట్టూర్చింది శాంతమ్మ". నా దొరను గొట్టనీకె వానికి చేతులెట్లాడినయమ్మా" మనవని తల నిమిరింది " ఈ తాన (సారి) ఇంటిదిక్కురాని, గిదే తరీకనేమో అడుగుత ! "కొడుకు మీద మండిపడ్డది.

కొంచెం సేపు ఎవరూ మాట్లాడలేదు. అంతలోనే సావిత్రి ఎందుకోసమో వచ్చినట్లుందనిపించింది శాంతమ్మకు. అభిమానవంతురాలైన సావిత్రి ఎవ్వరింటికి వెళ్ళదు. ఎప్పుడైనా కష్టం-సుఖం చెప్పుకునేది ఆమెతోనే అందుకే అడిగింది.

"ఏం బిడ్డా ! గీయాల్లప్పుడొచ్చినవు ?" అప్పుల బాధల గురించి చెప్పింది సావిత్రి.

"అయ్యో ! అప్పులైనోళ్ళకు, శేలు పాడైనోల్లకు పైసలిస్తున్నరంట గద బిడ్డా...! గవుర్మెంటు ..." గుర్తు చేసింది శాంతమ్మ.

" వాని పైసల మీద మంటవెట్ట. ఇస్తున్నరిస్తున్నరనుడే గాని, ఎవ్వనికి యేకాన పైసలిచ్చినట్లు దెలువది.ఎక్కడిస్తున్నరో, ఎవ్వనికిస్తున్నరో చిన్నమ్మా ! ఆ దేవునికెరుక ..."

"నిన్న రాతిరే కొంచెమంత అన్నముంటే పిల్లలకు పెట్టిన " దుఃఖాన్ని ఆపుకోవడం కష్టమవుతున్నది సావిత్రికి. "పిల్ల ఒగపూట లేకున్నా మొకం జూసి ఊకుంటది. పిల్లగాడు మాత్రం ఒక్క నిమిషం ఫరక్ గానియ్యాడు. ఏమన్న ఇంత దినిపిస్తే మంచిగానే ఉంటాడు. తి,డి లేదు. పాలకెగపడ్డడు... ఇగో ! నెత్తురొస్తున్నది ". ఎండిపోయిన రొమ్ము చూయించింది సావిత్రి. కళ్ళల్లో నీళ్ళాగలేదు శాంతమ్మకు.

"ఆయినకు దవకాన్ల జూపియ్యనీకె పైసల కోస్రము పట్టగొలుసులు కుదువ పెడ్తె - నూర్రూపాలిచ్చిండు శంకరయ్య సావుకారి. ఎనభై మందులకే వాయె. ఆటో కిరాయివోంగ కిలో నూకలొచ్చినయ్. కొంచెం కొంచెం నిన్న రాతిరి దాంక గడిపిన.... గివన్ని జూస్తుంటే యాడికన్న వొయ్యి ఉరిపెట్టుకోవాలనిపిస్తున్నది చిన్నమ్మా ....... ! ఎక్కిళ్ళ మధ్య ఇంక మాట్లాడటం ఆమెకు కష్టమయ్యింది.

"ఏం మాటమ్మా అవ్వి. ఊకో ! "మందలించింది శాంతమ్మ". కష్టాలు మనుషులకు గాకపోతే మాకులకొస్తయా ! " కష్టం లేనోడెవ్వడున్నడు ? గిట్ల జచ్చిపోవాలను కుంటే భూమ్మీద మనుషులే మిగులరు. కష్టాలు దిగ మింగుకోని ధైర్నంగ బతుకాలె బిడ్డా .... !"

"నచ్చజెబుతూ నడుముకున్న తమలపాకుల సంచిదీసి, అందులో నుండి రూపాయల నోట్లు తీసి లెక్క పెట్టింది. రెండు వందల ముప్పై అయిదున్నాయి.

"ఇస్తరాకులమ్మితే గివ్వొచ్చినయ్ బిడ్డా ! గీ మీది పైసలు నా కుండనియ్యి. ఇన్నూరు దీస్కపో ! " సావిత్రి చేతిలో పెట్టింది శాంతమ్మ.

శాంతమ్మ ఔదార్యానికి ఉక్కిరిబిక్కిరయ్యింది సావిత్రి. ఆపోచమ్మతల్లే శాంతమ్మ రూపంలో తనను కాపాడేందుకు వచ్చిందనుకుఉన్నది. రెండు కాళ్ళమీద పడిపోయింది.

"ఏమిదమ్మా యిది ?" కంగారు పడింది శాంతమ్మ. "పో ! పో ! జల్దివో ! పిల్లలెంత ఆకలిగొని ఉన్నరో ! ఏమన్నజేసి పెట్టుపో !" తొందర పెట్టింది.

అది ఆజ్ఞగా భావించి, లేచి వెళ్ళబోయింది సావిత్రి.

"సావిత్రీ ! " ఆపింది శాంతమ్మ " పొద్దుశాన వొయ్యింది బిడ్డా పిల్లలెంత ఆకలితో నున్నరో. ఉట్టిమీద పొద్దటిదింత పప్పుచారు, అన్నమున్నది తీసుకొని పో ! "

ఒక్క క్షణం కాళ్ళాడలేదు సావిత్రికి. ఎదుటివాళ్ళ మంచితనం కూడా ఒక్కోసారి మోయలేని భారమౌతుంది. "చిన్నమ్మా.... ! మరి నీకు ? " పిల్లల ఆకలికి, ఆ తల్లి చూపించే ప్రేమకు మధ్య కొట్టుమిట్టాడ సాగింది సావిత్రి మనసు.

"నాదే మున్నది బిడ్డా ! పొద్దుమూకి ఇంత చాయదాగిన, రాతిరికి యింత సల్లదాగితే తెల్లారుతది " అధి చాలా మామూలు విషయమన్నట్లు చెప్పింది శాంతమ్మ.

క్షణం తటపటాయించింది సావిత్రి. ఆపై మూడేళ్ళ కూతురు, ఏడాదిన్నర కొడుకు కళ్ళముందు మెదిలారు. పేగు బంధం, ఆకలిముడి ఆమెను మిగతా విషయాల నుండి దూరం చేశాయి. ఉట్టిమీదున్న సత్తు బొగువాని దీసి, అందులోని రెండు పిడికెళ్ళ అన్నం, ముంతలోనున్న చారు ఓ గిన్నెలో వేసుకొని, గబగబా ఇంటిదారి పట్టింది.

"నాయనమ్మా ! ఆకలయితున్నదే !" జాలిగా నాయనమ్మ మొహంలోకి చూస్తూఅడిగాడు రాజు. " అయ్యో బిడ్డా ! గింతకు జెర్ర ముందన్నా అడుగొద్దా బిడ్డా ! గిప్పుడే సాయిత్రిని అంతా ఊడ్చుకుపొమ్మంటి గదరా నాయనా !" మిగిలిన డబ్బుల్లో నుండి ఐదు రూపాయలు వాని చేతిలో పెట్టింది. " ఉస్సేనయ్య దుకానంలో వొయ్యి బిస్కోట్లు కొనుక్కో ! పో ! " అంది.

వాడు సంతోషంతో తుర్రుమన్నాడు అక్కడినుండి.

"పిల్లగాడొచ్చినాడమ్మా యాడికి (ఇక్కడికి)' ? భుజం మీది తువ్వాలు దులుపుతూ హడావిడి పడుతూ వచ్చాడు సాయన్న.

"ఆ ! " అంది శాంతమ్మ. కొడుకు రాక ఏదో అపశకునంలా అనిపించి, తెలియని భయాన్ని నింపింది ఆమెలో.

సాయన్న సాధారణంగా తల్లి దగ్గరికి రాడు. వచ్చాడంటే ఏదో గొడవ పెట్టుకొని, ఎంతో కొంత లాక్కుపోవడం ఖాయం. దరిద్రం అతని వ్యక్తిత్వాన్ని హరించేసింది.

"ఎక్కడవొయ్యిండు ?"

"గీడనే - ఉసేనయ్య దుకాణంల బిస్కోట్లు దెచ్చుకుంటనంటాని వొయ్యిండు "

" పైసలొచ్చినాయ్ ?" ఆశ్చర్యం, ఆనందం, అధికారం - సాయన్న.

"ఎక్కడివి ?" భయం, ఆందోళన, అనుమానం - శాంతమ్మ.

"ఇస్తరాకుల పైసల్ రాలే ?" చురుక్కున అడిగాడు.

"............." శాంతమ్మ గుండెలో రాయిపడింది. 'గద్దలాక యాడ జూసిండో నా కొడుకు!' మనసులోనే విసుక్కుంది భయంతో.

"ఎన్నొచ్చినయ్ ?" తల్లి మౌనాన్ని అర్థం చేసుకొని దబాయించాడు.

" ..............".మౌనం తప్ప మార్గంలేని శాంతమ్మ.

"కన్నబిడ్డలకియ్యనీకె నీ దగ్గర పైసలుండయి. అడ్డమైనోళ్ళకియ్యనీకె ఉంటయ్" తనకివ్వలేదన్న బాధకంటె మరొగరికిచ్చిందన్న అక్కసు అతనిలోని మనిషిని చంపేసింది.

ముందు తల్లి చేతిలోనున్న సంచి లాక్కొని అందులోని ముప్పై రూపాయలు తీసి జేబులో వేసుకున్నాడు. అంతటితో ఊరుకోక విసురుగా ఇంట్లోకెళ్ళి దొంతరలన్నీ వెతకసాగాడు. ఆ ప్రయత్నంలో ఖాళీ కుండలు రెండు అతని కోప తాపానికి బదాబదలైపోయాయి. శాంతమ్మ ఆవేదనతో అంగలారుస్తుంటే మరింత రెచ్చిపోయాడు.

చివరికొక కుండలో రెండు సేర్లబియ్యం కనిపించాయి. 'రానిచోట రాయేమే'ల నుకుంటూ ఆ బియ్యం పంచెకొంగులో పోసుకొని ముడేసుకున్నాడు. సుడిగాలిలో వెళ్ళిపోయాడు. వెళ్తూవెళ్తూ కొడుకుని లాక్కొని పోయాడు.

సగం చచ్చి, ఉన్నచోటే కూలబడిపోయిందా శాంతమ్మ. ఏడవటానికి క్కూడా ఓపికలేక చాలాసేపు అలాగే వుండిపోయింది. తన దురదృష్టాన్ని కొడకు పేదరికాన్ని తిట్టుకుంటూ మెల్లగా లేచి పెద్దలైటార్పేసి, బెడ్‌లైటు వేసుకొని, కాళ్ళు కడుపులో పెట్టుకొని నిద్రపోయేందుకు వ్యర్థ ప్రయత్నం చేయసాగింది.

ఎన్నెన్నో అనుభవాలు, జ్ఞాపకాలు, అగచాట్లు ఆమెను అతలాకుతలం చేస్తున్నాయి.

మనవడు యాదికొచ్చి నానికోసమైనా బతకాలని కళ్ళనీళ్ళు తుడుచుకుంది శాంతమ్మ.❖